
ఇచ్ఛ-దైవేచ్ఛ
భూపతి
S.d. Rao

"నా జీవితమే వృథా!"

"ఛీ—ఎన్నిసార్లు చెప్పాలిరా నీకు—అలా అనద్దని? ప్రపంచంలో ఏ వ్యక్తీ అనవసరంగా పుట్టడు....."

రాజు నేను చెపుతున్న మాటలకు విలువ యివ్వనట్లు గులకరాళ్ళు చెరువులో విసురుతున్నాడు. నేను మాత్రం నా ధోరణి మానలేదు.

".....అంటే...పుట్టిన ప్రతివాడివల్లా ప్రపంచానికి ఉపయోగం ఉంటుందనికాదు నా భావం. కానీ ప్రతి ఒక్కని ఉనికివల్లా కొందరికన్నా ఉపయోగమో, సంతోషమో, ఆనందమో మరేదైనానో ఉండితీరుతుంది." నేను ఆవేశంతో చెప్పాను. పసిపిల్లాడికేసి చూసినట్లు రాజు నాకేసిచూసి ఆఖరి రాయి చెరువులోకి విసిరేసి చేతులు దులుపుకున్నాడు.

"వాసూ! నువ్వు చెప్పేది—దగ్గర దశాంశం వరకూ సవరించిచూస్తే—నూటికి నూరు పాళ్ళా నిజమే—నేను కాదనను. కానీ, నా ఉనికి ఎవరికి ఆనందం?" అన్నాడు తీక్షణంగా చూస్తూ.

అలాంటి ప్రశ్నకు సమాధానం యివ్వడానికి నేను సిద్ధంగాలేను. ఆ సంగతి కనిపెట్టిన రాజు చిన్నగా నవ్వాడు.

"నీ ఉనికి నాకు ఆనందంరా" అన్నాను రాజు ముఖంలో మార్పు గమనిస్తూ.

"నిజమే! నేను చచ్చిపోతే కన్నీరు కార్చేవాళ్ళు ఎవరైనా గనుకఉంటే నువ్వు ఒక్కడవే. ఆ సంగతి నాకు తెలుసు."

ఆ మాటలు ఎంత బాధతో కూడినవో నాకు అర్థం అయ్యింది. రాజు నేలమీద వేలుతో గీతలు గీస్తున్నాడు.

"రాజూ నే నొక మాట చెప్తాను వింటావా? షేక్స్‌పియర్ ఏమన్నాడో తెలుసా—ప్రపంచం అనేది ఒక స్టేజి—అందులో మనం అందరం పాత్రధారులం అన్నాడు. కనుక మన పాత్ర ఎంతవరకూ అవసరమో, ఎంతవరకూ అనవసరమో మనని ప్రవేశపెట్టిన వాడే తేల్చుకుంటాడు. మనం కాదు ఆ సంగతి తేల్చేది. నువ్వు అనవసరం అని వాడికి ఎప్పుడుతోస్తే అప్పుడే నిన్ను తోసేస్తాడు యీ స్టేజిలోంచి, తెలుసా" అన్నాను.

నా ఉపన్యాసానికి రాజు చప్పగా నవ్వాడు.

"పోనీ అలాగే అనుకుందాం. కానీ నాటకంలో నీకు నచ్చని పాత్ర యిస్తే ఒప్పుకుంటావా? ఒప్పుకోవు. అంతగా వస్తే నాటకం మానేస్తావు. అవునా—అలాగే నేనూను...." అన్నాడు రెండు చేతులూ వెనక్కి ఆనించి తలఎత్తి ఆకాశం వంక చూస్తూ.

రాజు చిన్నప్పటినుండీ అదోక రకమైన మనిషి. అతని నిశ్చయాన్ని, విశ్వాసాన్నీ ఎవరూ మార్చలేరు. అతనితో మాట్లాడడం అంత తేలికయిన పనికాదు.

"అయితే నీ నిశ్చయం ఏమిటి?" అన్నాను.

"నా నిశ్చయం—అదే—నాకు జీవితేచ్ఛ ఏనాడో పోయింది. కాని, ఎప్పుడు—ఎలాగ—నా తనువు పోతుందో నాకే తెలియదు" అతని మాటల్లో విరాగి మాటల్లోకన్నా ఎక్కువ నిస్పృహకనుపించింది.

**"అవును నీకేం? సూటూ, బూటూ వేసుకున్నావు. ఎన్నికబుర్లయినా చెబుతావు" అన్నాడు రాజు. ఈ మాటలకు వాసు మనస్సులో వెయ్యి శూలాలతో పొడిచినట్లు బాధపడ్డాడు.**

"రాజూ! యీవిధంగా నన్ను మాటలతో హింస పెట్టావంటే నీతో షికారుకు నేను రాలేను" అన్నాను ముఖంమీదికి కోపం తెచ్చుకుంటూ.

"ఆవేశపడక—మనిషికి పశువుకూ ఉన్న తేడాయే అది"

"అలా అనక. పశువులకు కూడా ఆవేశం ఉంటుంది. ఆగ్రహం కూడా ఉంటుంది. ఆవుచూడు—అంతదాకా ఎందుకు పిల్లిచూడు—దాన్ని గనుక మనం ఎక్కువగా భయపెడితే మన గుడ్లుపీకి గూట్లో పెడుతూందిట......ఆ ఉద్రేకమే గనుక లేకపోతే......."

"అలాగని మీ బామ్మ చెప్పిందా" నవ్వుతూ అన్నాడు రాజు.

"కుట్టని తేలు—కుమ్మరిపురుగుకన్నా హీనం" అన్నారు పెద్దలు తెలుసా? కుడితేగాని తేలుకు గౌరవం, అదంటే మనకు భయం ఉండవు తెలుసా"

రాజు మాట్లాడకుండా తలపంకించాడు పాలేరు కుర్రాళ్ళు గేదెలను చెరువులో కడిగి వాట్నమీద ఎక్కి కూర్చున్నారు. వాళ్ళల్లో ఒక కుర్రాడు "సానా పొద్దాకిందయ్యగారూ యింకా కూకుండారేమిటి?" అన్నాడు మమ్మల్నిచూసి.

"వాడి మాటల్లో ఎంత ఆప్యాయత ఉందో చూడు. వాడికి మనం ఏమైనా పెట్టామా, పోశామా? రోజూ యిక్కడ కూర్చున్నందువల్ల అయిన పరిచయమేగదా? ఆమాత్రం ఆప్యాయతకు కూడా నేను నోచుకోలేదు" అంటూ రాజు లేచి నించుని క్రిందనున్న రుమాలు తీసుకున్నాడు.

నేను కూడా లేచాను. "రాజూ—పసికందు—పాలకోసం ఏడిస్తే పాలు కలిపేలోగా వేలు నోట్లో పెడుతారు. పసిపిల్ల ఆవేలే 'పాలపీక' అనుకుని అది చప్పరిస్తూ, పాలు వస్తున్నాయని తృప్తి పడుతుంది. కానీ రాను రానూ పెద్దయ్యాక అది పాల కీక కాదని, పాలురాటంలేదనీ గ్రహించి, కాస్సేపు చప్పరించినా తర్వాత వేలుతో సేనుకుంటూ ఏడుస్తుంది తెలుసా—ఆమాత్రం జ్ఞానం లేదు నీకు" అన్నాను.

"నిజమే" అన్నాడు నెమ్మదిగా.

చెరువుగట్టు వెంబడి ముందు నేను నడుస్తున్నాను. నా వెనకాల రాజు నడుస్తున్నాడు. గట్టుమీదనున్న యీతచెట్టు సమీపానికి వచ్చాను. అమాంతం ఒక కాకి వచ్చినా నెత్తిమీద తన్ని ఎగిరిపోయింది. కొన్ని కాకులు అరుస్తూ ఎగరసాగాయి. నేను రెండు చేతులూ నెత్తిమీద పెట్టుకుని కొంచెం వంగడంవల్ల నెత్తి చిల్లుపడలేదు.

'ఏమయ్యింది?" అన్నాడు రాజు ముందుకు వస్తూ.

"ఆగు. వెనక్కివద—యిక్కడెక్కడో కాకి పిల్ల పడిపోయి ఉంటుంది యీ చెట్టుమీంచి జారి. మనం ముందుకు ఒక్క అడుగు వేసినా పొడిచి చంపేస్తాయి" అన్నాను వెనక్కు వచ్చేస్తూ.

"చూద్దాంపద" అన్నాడు రాజు నన్ను తోసుకుని ముందుకు వెళుతూ. కాకులు గోల గోలగా అరువులు ప్రారంభించి రాజుమీద పడ్డాయి. "రాజూ వృథా శ్రమపడక రా—వచ్చెయి" అన్నాను నేను మరో రెండడుగులు వెనక్కివేస్తూ. నెత్తిన చేతులు పెట్టుకుని రాజు వెనక్కి వచ్చేశాడు.

'దానిపిల్ల అంటే దానికి ఎంత ప్రేమో చూడు—ఆ కాకి దాని చుట్టం కాకులూ కూడా కాపలా కాస్తున్నాయి. చెట్టంత మానవుణ్ణి కూడా ఛీ కొనడానికి వెనుదీయటంలేదు" అన్నాను.

"మానవులకూ, పశుపక్ష్యాదులకూ ఉండే తేడాయిదే" అన్నాడు రాజు నా వెనకాల వస్తూ.

"అంటే" అని అడిగాను.

"ప్రేమ, వాత్సల్యం, అభిమానం—యివన్ని రాను రాను మానవుల్లో తగ్గిపోతున్నాయి. పశుపక్ష్యాదులలో యివన్ని రాను రాను ఎక్కువయిపోతున్నాయి—యిది నా అభిప్రాయం—బహుశా తప్పు అయివుండచ్చు" అన్నాడు.

నేను రాజు విమర్శనకు ఆశ్చర్యపడకుండా ఉండలేకపోయాను. "నిజమే" అన్నాను.

"స్వానుభవం నిజంకన్నా గొప్పది" అన్నాడు రాజు. దారిలో యింకేమీ మాట్లాడలేదు. మౌనంగా ఎవరింటికి వాళ్ళం చేరుకున్నాము.

భోజనంచేసి ఆరుబైట వెన్నెలలో మంచం వేసుక్కున్నాను. గేదెకు పాలు పిండిన అమ్మ దూడను వదిలింది. 'అంబా' అంటూ అది ఒక్క గెంతులో తల్లివద్దకు వెళ్ళిపోయింది. ఆ దృశ్యం నాకు ఆనందాన్ని కలుగజేసింది.

పండు వెన్నెల పిండి ఆరబోసినట్లుంది. "చంద్రునికి ఎంత పక్షపాతం? తన వెన్నెలను పట్నవాసులకన్నా పల్లెవాసులకే ఎక్కువగా యిస్తాడు. వెన్నెల ఒక్కటే కాదు — ప్రకృతి అంతా అంతే. పట్నవాసులు ప్రకృతి అనుభవించలేరు" అనుకున్నాను వెల్లకిల్లా పడుకుని చంద్రునికేసి చూస్తూ.

నా మనస్సు చంద్రునినుంచి రాజుమీదకు మళ్ళింది.

రాజు— అతను గంభీరుడు. తండ్రి అంత నీచంగా సంచరించినా—ఆ సంగతి ఆప్తమిత్రుణ్ణయిననాతో కూడా చెప్పడు. మాట వరసన అతనిచ్చే సూచనల ద్వారా గ్రహించాల్సిందేకానీ అతను ఏనాడూ కావాలని చెప్పలేదు.

తాతయ్య పడుకుని సంస్కృత శ్లోకాలు గట్టిగా చదువుతున్నాడు. ఈ విషయం తాతయ్యని అడిగి తాతయ్య అభిప్రాయం తీసుకుందాం అనుకుని మంచంమీంచిలేచి వంటింటి గుమ్మం దగ్గరున్న ముక్కాలిపీట తెచ్చుకుని మంచం దగ్గర వేసునికుని తాతయ్యతో రాజు సంగతి చెప్పాను. నా ప్రశ్నలకు సమాధానంగా తాతయ్య సంస్కృత శ్లోకంలో ఒక పాదం చదివాడు.

"ప్రాప్తేతుషోడశవర్షే — పుత్రం మిత్రవ

దాచరేత్''.....అంటే, అంటూ దాని అర్థం మొదలు పెట్టాడు.

''పదహారేళ్ళు గడచిన కొడుకును ఏ తండ్రి అయినాసరే తన స్నేహితుణ్ణి చూసినట్లు చూడాలి గాని, కొడుకుగదా అని అజమాయిషీ చెయ్యకూడదు. అలా చేస్తే — తన కొడుకుకు తనని ఎదిరించవలసిన పరిస్థితి తనే యిచ్చినవాడవుతాడు. నువ్వేం భయపడనక్కరలేదు — కాలగమనంలో రాజే వాళ్ళ నాన్నని ఎదిరించక తప్పదు—రబ్బరుకు—నొక్కినకొద్దీ ఎగిరే శక్తి, లాగిన కొద్దీ కుంచించుకునే శక్తి స్వతసిద్ధంగానే ఉంటాయి. మనమేం నేర్పక్కరలేదు'' అన్నాడు.

తాతయ్య మాటలు నగ్నసత్యాలు. కానీ రాజు పట్ల యీ శ్లోకాలు నిజం అనిపించుకుంటాయి అని నాకు తోచలేదు.

నా పక్కమీదకు వచ్చి నిద్ర కుపక్రమించాను.

* * *

మర్నాడు మామూలు ప్రకారం చెరువు గట్టు మీద కూర్చున్నాము. రాజు చెరువులోకి రాళ్ళు విసురుతున్నాడు.

''రాజా! ఇంటరుకి నువ్వు మీ నాన్నగారింటికి వెళ్ళిన దగ్గరనుంచి యీ మూడు సంవత్సరాలల్లో జరిగిన విషయాలు క్లుప్తంగా చెప్పు—మనం ఒక మార్గం తొక్కుదాము' అన్నాను.

నా మాటలు వింటూనే అతని ముఖం నల్లబడిపోయింది. పక్కనున్న గడ్డిపువ్వునుకోసి నలిపి నీళ్ళలో పారేశాడు. అతని కళ్ళవెంట నీరు ప్రవాహంగా కారుతోంది. తలవంచుకుని మౌనంగా కన్నీరు కార్చడం మొదలు పెట్టాడు. నాకు కడుపులో ఎవరో చెయ్యిపెట్టి కదిపినట్లు బాధ కలిగింది.

''రాజా! అనవసరంగా మథనపడక. నువ్వేం చెప్పక్కరలేదులే'' అన్నాను వోదార్పుగా రాజు భుజం తట్టి. రాజు శిలాప్రతిమలా కదలకుండా ఉండిపోయాడు.

''రాజును యిక ఎన్నడూ ఏమీ అనకూడదు. వీలైతే విషయాలను గ్రహించి హద్దులు మీరకుండా మరీ మాట్లాడాలి. రాజు మనస్సు అనవసరంగా కష్టపెట్టకూడదు'' అనుకున్నాను.

అంత బాధపడినాసరే కన్నతండ్రి అంటే ఎంత గౌరవం, ఎంతగుట్టు? కొసబియాంకా' కథ విన్నవారు అమితాశ్చర్యపోతారు. కాని రాజు కథ విన్నవారు? కాస్సేపుదాకా నమ్మరు కూడా. ఏది ఏమైనా రాజు అంటే నాకు అసమానమైన గౌరవం, అభిమానం ఉన్నాయి.

''రాజా అనవసరంగా బాధపడక. బి. బి. ఏ. అయిపోనియ్యి — ఆ తర్వాత నువ్వు సంపాదించుకోగలవు—అంతదాకా ఎలాగో అలాగ జాగ్రత్తగా కాలక్షేపం చెయ్యి'' అన్నాను ఏమనాలో తెలియక.

''నిజమే. కానీ నాకా శక్తి లేదు. ఈ బి. ఏ. నేను పూర్తి చేయుగలననే నమ్మకం నాకులేదు. నేను ఎలాగూ చివరిదాకా బతకలేను'' అన్నాడు. అతని మాటలలో ఎంత నిస్పృహ ఉందో కనిపెట్టగల శక్తి నాలో లేదు. అతన్ని హుషారుపరచాలన్న ఉద్దేశ్యంతో ''చస్తాను చస్తాను అన్న ఎవ్వడూ చచ్చేదాకా చావలేదు. వాళ్ళల్లో నువ్వోకడివి'' అన్నాను.

''అలాగే అయితే నా అంత దురదృష్టవంతుడు ప్రపంచంలో మరొకడు ఉండడు.''

''ఏడిచేవు లేవోయ్!''

''అది చేసినా హాయిగా వుంటుంది. ఏమీ చెయ్యలేనప్పుడు బావురుమని ఏడిస్తే ఎంత రిలీఫ్ వస్తుందో తెలుసా? నాకు అటువంటి అదృష్టం కూడా పట్టదు'' అంటూ కళింగంమీద వెల్లకిల్లా పడుకున్నాడు.

''రాజా! యిదిగో ఆఖరిసారిగా చెపుతున్నాను. నువ్వు యీ రకమైన మాటలు మాట్లాడితే నేను నీతో రాలేను. ఇంతకన్నా నన్ను చిత్రవధ చేసినా నాకు ఆనందనే'' లేచినుంచున్నాను.

రాజు కూడా లేచాడు. ''వాసూ! నా మనస్సులో ఉన్న విషయం నీతో చెపుతున్నాను. స్నేహితుడు అంటే నాకు పవిత్రమైన అభిప్రాయం ఉంది. తన స్నేహితుని మనస్సు నొప్పించకుండా అతని మనస్సును అనుసరించి మాట్లాడుతూ అతన్ని ఆనందపరిచేవాడే స్నేహితుడు. ఇంగ్లీషులో అలాంటి స్నేహితుణ్ణి 'ఫ్రండు' అని నేను అనలేను. ఫ్రండు అంటే పేలవంగా ఉంటుంది నాకు. స్నేహితుడు అని అంటే ఆపదం నా వళ్ళు పులకరిస్తుంది. అటువంటివాళ్ళల్లో నువ్వు — అసలు స్నేహితుడు అన్న పదానికి నువ్వే నాకు స్ఫురిస్తావు'' అన్నాడు కట్టవెంబడి నడుస్తూ.

ప్లీడరు:- (సాక్షితో) నువ్వే మీ చదువుకోలేదన్నావు! మరి యింత తెలివిగా జవాబు లెలా ఇవ్వగలుగుతున్నావు?

సాక్షి:—బుద్ధితక్కువ ప్రశ్నలకి జవాబివ్వడానికి చదువక్కరలేదండి.

యం. ప్రభాకరరావు (కావలి)

* * *

శలవులు అయిపోయాయి. నేను నా చదువు కోసం బందరు వెళ్ళిపోయాను. రాజు బెజవాడ వెళ్ళిపోయాడు. నేను బందరు వెళ్ళేనాడు ''రాజా: ఏ విధమైన అఘాయిత్యం తలపెట్టనని, వేసంగుల్లో మళ్ళా కనుపిస్తాననీ నాకు నువ్వు హామీ యివ్వు'' అన్నాను. రాజు ''చూద్దాం''అన్నాడు.

* * *

కాలేజీలు తెరిచి అప్పుడే నెల అయిపోయింది. పరీక్షలు దగ్గరకు రావడంవల్ల హోరాహోరీగా చదవడం ప్రారంభించాము.

ఒకనాడు టపాలో రాజు దగ్గరనుండి నాకొక ఉత్తరం వచ్చింది. అది పదిహేను పేజీలైనా ఉంది. వంటరిగా ఒక మూల కూర్చుని ఆ ఉత్తరాన్ని ఆమూలాగ్రం చదివాను. నాకు మనస్సంతా వికలమయిపోయింది. కాలేజీలో ఉండలేక రూముకు వచ్చేశాను. మంచంమీద పడుకుని రాజు విషయం ఎంతసేపు ఆలోచించానో నాకే తెలియదు. ''అలా వున్నావేం'' అన్న నా రూముమేటు మాటలతో యీ లోకంలోకి వచ్చాను. ''అబ్బే ఏం లేదు'' అన్నాను పొడిగా. ''సినిమాకి వెళ్దాం వస్తావా?'' అన్నాడు అతను.

''ఇప్పుడేం సినిమా'' అన్నాను నేను.

''అసలు వస్తావా అని అడిగాను''

నాలుగేళ్ళనుంచి నాతో సహజీవనం చేస్తున్న నా రూముమేటు ప్రసాద్‌తో యీ విషయం ముచ్చటించి అతని అభిప్రాయం కూడా తీసుకుందాం అనుకున్నాను. ఆ నిశ్చయంతోనే ''నేనో విషయం అడుగుతానుగానీ చెప్తావా?'' అని అడిగాను.

''ఏమిటి'' అన్నట్లు నాకేసి చూశాడు.

''ఇది వూహ అనుకో — నీ సలహా మాత్రం చెప్పు'' అని ప్రారంభించాను—''నీ తండ్రి మొదటి భార్యకు నువ్వొక్కడివే సంతానం అనుకో. నిన్నుకని మీ తల్లి చనిపోయిందనుకో. మీ నాన్న రెండో పెళ్ళి చేసుకున్నాడు అనుకో — మీ పినతల్లి వయస్సులో చాలా చిన్నపిల్లా, మంచి గుణం కలది ప్రత్యేకంగా నువ్వంటే అభిమానించేదీ అయిందనుకో—అదే మీ తండ్రికి అనుమానం అయిందనుకో—నిన్ను తన్నడానికి వచ్చాడనుకో—'' అన్నాను గబ గబా.

''ఇవన్నీ అనుకోడాలు కాకుండా నిజంగా జరిగితే నేనైతే ఆ తండ్రిని అమాంతం యిలా పుచ్చుకుని అలా పైడు కాలవలోకి పారేస్తాను అంతే'' అంటూ తన చేతిలో బూటు రూమవతలకు విసిరేసి పరిగెట్టి కెళ్ళి తెచ్చుకున్నాడు.

''లేకపోతే'' అన్నాను నేను మంచంమీంచి లేచి కూచుంటూ.

''లేకపోతేనంటావా? ఆ యింట్లోంచి వేరుపడి నాకు కావలసిన ఆస్థిపాస్తులూ చిన్నం చిదరా, నగదూ, నట్రా, బట్టా పాతా అంతా టకాయించి సదరు కోర్టువారి ద్వారా రాబట్టుదును!''

నాకు అతను చెప్పింది నిజమే అనిపించింది. కానీ అది రాజు చెయ్యలేని పని.

''ఏం అలాంటి పరిస్థితిలో ఎవరైనా చిక్కుకున్నారా?'' అన్నాడు నా ముఖకవళికలు కనుకున్న ప్రసాద్.

''అవును''

''ఆ! వాస్తవికంగా అలాంటి తండ్రి ఉన్నాడా? నీ స్నేహితుణ్ణి వాళ్ళ బాబును యీడిచి నాలుగు తన్నమని రాయి. కనగానే తలిదండ్రులయిపోతారా? చిత్తశుద్ధీ, ప్రపంచజ్ఞానం అక్కర్లే—అదేదో సామెత చెప్పినట్లు కన్న ప్రతీ అమ్మా, తల్లి అవదు. దాని మొగుడు తండ్రీ అవడు!'' అన్నాడు.

''కాని నా స్నేహితుణ్ణి వాళ్ళ నాన్నేతన్ని అవతలకు తగిలేశాడు. సగంలో ఆగిపోయిన చదువుకోసం మేనమామ దగ్గర అప్పుకోసం వెళ్తున్నానని రాశాడు'' అన్నాను నెమ్మదిగా.

"మీవాడెలా వూరుకున్నాడోయ్. చదువులో జీనియస్ ఏమిటి?"

"జీను"

"అదీ! అలాగ చెప్పు. ఈ ఫస్టు మార్కులూ, యూనివర్శిటీ ఫస్టులూ వచ్చే కుర్రాళ్ళు బయట ప్రపంచంలో అంతే — వింతపశువులు — ఖ్యాగాలల్లా వుంటారు. యిది నా అభిప్రాయం సుమీ. ఎవ్వరితోనైనా అనేవు. వీపు పగలగొట్టి సున్నం మెత్తి ఆముదం రాసి నవ్వారు మంచంమీద పడుకో బెట్టి నీలం దుప్పటి కప్పుతారు" అనేసి నవ్వు కుంటూ సబ్బు తీసుకుని బాతురూమువైపు నడి చాడు.

* * *

మరోవారం రోజుల్లో రాజు దగ్గరనుంచి మరో ఉత్తరం వచ్చింది. "పోనీలే నోటు రాయించు కునైనా యిచ్చాడు" అనుకున్నాను.

రాజు దగ్గరనుంచి తరుచు ఉత్తరాలు నాకు వస్తూనే ఉన్నాయి. ఒకనాడు వచ్చిన ఉత్తరం మళ్ళా నన్ను కలవరపెట్టింది. "మళ్ళా ఆ గుమ్మం ఎందుకు ఎక్కావు?· నీకు మంచి పనే అయింది. తల పగలడం చాలా మంచి బహుమతి నీకు. యీసారి వెళితే నీ ప్రాణం పోయినా నేను ఆశ్చర్యపోను — కాని ఒక విషయం — నీవల్ల అమాయకురాలైన నీ పినతల్లి జీవితం నాశనమవకుండేలాగ చూడు" అని రాశాను చొరవ తీసుకుని.

* * *

అవేళ ఆఖరు పరీక్షరాసి వచ్చాను. కాలేజీతో ఋణం తీరిపోయింది యీనాటితో అన్న ఆనం దంతో కుర్రాళ్ళు సినిమాలకు బయల్దేరారు. నేనూ, ప్రసాదూ సినిమాకి వెళ్ళాము. ఆ మర్నాడు కూడా నాకు అక్కడ పనుండడంవల్ల ఉండిపోయి మూడోనాటి ఉదయం కారెక్కాను.

* * *

బస్‌స్టాండుకు రాజు వచ్చాడు. 'ఒరేయ్ వాసూ' అని పిలిచేదాకా నేను వాడిని గుర్తు పట్టలేక పోయాను.

ఇద్దరం రిక్షాలో కూర్చున్నాము. "పరీక్షలు ఎలా రాశావు?" అన్నాడు నన్ను—'బాగానే వ్రాశాను.. అది సరేకాని యిలాగ మారిపోయావేంరా రాజూ— నిన్ను ఆనవాలు కట్టడమే కష్టమయ్యింది" అన్నాను నేను. "మనోవ్యాధికి మందులేదు అని నీకు తెలుసు కదురా? యింతకన్నా చిక్కలేక యింతతో ఆగి పోయాను" అన్నాడు గంభీరంగా.

* * *

వేసంకాలంలో చెరువుగట్టుమీద కూర్చోకుండా ఎదురుగావున్న మోటబావిగట్టుమీద కూర్చోడం మాకు అలవాటు. అలవాటు ప్రకారం బావిగట్టున కూర్చున్నాము. రాజు గట్టుమీద కూర్చుని కాళ్ళు బావిలో వెళ్ళాడేశాడు. నే నతని పక్కనే కూర్చు న్నాను. నిశ్శబ్దం రాజ్యం చేయసాగింది. ఒక రాయి తీసి రాజు బావిలో పడేశాడు. 'బుడింగ్' అని శబ్దం చేసింది. నేను నీళ్ళల్లోకి చూశాను. రాయి పడిన చోటునుండి నీటితరంగాలు రింగులు రింగులుగా నూతిగట్టువరకూ పరిగెత్తు తున్నాయి.

రాజు జేబులోంచి ఒక కాగితంతీసి నా చేతికి అందిచ్చాడు. మడతవిప్పి దాన్ని చదివాను. నా ముఖంలో మార్పులు గమనిస్తున్నట్లు రాజు నాకేసి చూస్తున్నాడు. కాగితం చదివేసి మడతపెట్టి రాజుకు అందించేశాను.

"మీ మామయ్య యిలా రాయడానికి కారణం ఏమిటి?"

"మా నాన్న ఆస్తినాకు రాదని తెలియడమే."

"ఎందుకురాదు?"

"మా నాన్నగారిది స్వార్జితం. పిత్రార్జితం కానీ కూడా లేదు."

నాకేమని చెప్పాలో తెలియలేదు. "అయితే ఏం చెయ్యదలుచుకున్నావు?" అన్నాను.

దానికి సమాధానంగా రాజు కాళ్ళను వూపుతూ నవ్వాడు. అతని ఎడంకాలు చెప్పు జారి నూతిలో పడింది. అరే! చెప్పు జారిపడిపోయిందిరా— లేలే— నువ్వూ పడగలవు."

"ఇప్పుడు ఏం జరిగిందో చూశావా?"

"చెప్పు జారి నూతిలో పడిపోయింది."

రాజు మిగిలిన చెప్పును తీసి చేత్తో పట్టుకుని "దీని ఉపయోగం యిప్పుడు ఏమైనా ఉందా?" అని అడిగాడు.

నాకు రాజు ప్రశ్న అర్థమయ్యింది. "ఆ వుంది" అన్నాను మొండిగా.

"ఏమిటి? చెప్పు....."

"చెప్పులుచేసేవాడికిస్తే దీనిలాంటిది యింకో చెప్పు తయారుచేసి యివ్వగలడు."

"అప్పుడు ఒక కాలికి కొత్త జోడూ మరో కాలికి పాత జోడూ తొడుక్కుంటావన్నమాట. ఏం తెలివిరా, వ్యాసభూపతివి కూడాను మళ్ళా!" నవ్వుతూ అన్నాడు.

"అందుకనే పేరు అలా మార్చుకున్నాను."

"అప్పుడు యీ చెప్పు గతి ఏమిటో తెలుసా?"

"తెలియదు.

"ఇదీ దీనిగతి" అంటూ దాన్ని రంయ్యిమని నూతిలో గిరాటు వేశాడు. 'ఛీ ఛీ' అన్నాను నేను. నాకు తెలియకుండానే.

"ఏం? జత—అంటే దిక్కులేని ఆ చెప్పుకు అంతకన్నా ఏం జరుగుతుంది"

"అది సరేలేగాని, మరి నీ విషయం ఏమిటి?'


ఒకాయన ఇంకో ఆయ నతో:

ఏమండీ నా ఆరోగ్యం ఫేలయ్యేట్లుంది.

రెండో ఆయన పరధ్యా నంగా ఆ ఫరవాలేదు లెండీ, సెప్టెంబరులో పేసవుతుంది

కె. పద్మ (విజయవాడ)


"ఆ చెప్పుగతే" అన్నాడు నీళ్ళలో తన ప్రతి బింబాన్ని చూసుకోడానికి వంగుతూ.

"ఛీ రాస్కెల్—నా చిన్నతనంనుండి నువ్వు యిలాగే అంటున్నావు. చచ్చేవాళ్ళెవరూ చెప్పి చావలేదు." అన్నాను కోపంతో. రాజు నవ్వుతూ బావిగట్టుమీద వెల్లకిల్లా పడుకున్నాడు.

"రాజూ షేక్స్‌పియర్ రాసిన 'హేమ్లెట్' చది వావుకదా—వాడు అలాగే తనలో తను మథనపడి సర్వనాశనమూ అయ్యాడు. ఏ విషయాన్నీ కూడా చివరదాకా తరచి చూడకూడదు. తాడు తెగేదాకా లాగకూడదు" అన్నాను నేను మళ్ళా. రాజు నిశ బ్దంగా ఆకాశంవంక చూస్తున్నాడు.

"అయితే నోటులో ఎప్పుడు యిస్తానని రాశావు?"

"ఎప్పుడు అడిగితే అప్పుడు యిచ్చేలా రాశాను.

"ఏడవలేకపోయావూ? అదేం తెలివిరా? ఉద్యో గంలో చేరిన తర్వాత తీర్చగలనని రాయాలిగానీ. యిప్పుడు మీ మామయ్యలాయరు నోటీసు యిస్తే" అన్నాను.

ఆ సంగతి ఆలోచించలేదు నే నప్పుడు.

"నీకు చావు విషయం తప్ప రెండో విషయం ఆలోచించే శక్తి లేదు."

"అవును ఆ మాట నిజమే" అని రాజు లేచి కూర్చున్నాడు.

"రాజూ మనం యీ వేసంగిలో చెరువుగట్టు మీద కూర్చోకుండా యీ నూతి గట్టుమీద కూర్చుంటాం ఎందుకో తెలుసా"

"చెరువులో నీళ్ళు ఉండవు గనుక.

"అంటే?"

"అంతకన్నా నాకు తెలియదు."

"మనకు యిష్టమైన వస్తువు ఒకచోట లేన పుడు అది ఎక్కడఉంటే అక్కడకు వెళ్తామన్న మాట. నీళ్ళున్నప్పుడు చెరువు గట్టుమీద కూర్చునే వాళ్ళం. నీళ్ళులేవు గనుక యిప్పుడు యీ నూతి గట్టుమీద కూర్చుంటున్నాను ఏమంటావు' అన్నాను.

"కానీ మనకు యిష్టమైన వస్తువు ఎక్కడా లేకపోతేనో"

ఆ ప్రశ్నతో నా గొంతుకు తాళం పడింది. ఒక క్షణం ఆగి "అది మనం అనుకోడంలో ఉంటుంది" అన్నాను. 'అవును. నిజమే' అన్నాడు రాజు మళ్ళా పడుకుంటూ.

సూర్యుడు ఆలోచించి ఆలోచించి మరీ పడ మటి దిక్కునఉన్న కొండల చాటుకు వెళ్ళిపోయాడు. అంతదాకా లోకంతో ఆడుకున్న అతని కిర ణాలు మాత్రం లోకాన్ని అప్పుడే వదలం యిష్టం లేనట్లు కొండల వెనుకనుంచి కనుపిస్తూనే వున్నాయి. ఇద్దరం లేచి గృహోన్ముఖులమయ్యాము.

* * *

మా షికారు రోజూ సాగుతూనే వుంది. బంగా రము ఎంతసేపు ఒళ్లో పెట్టుకు కూర్చున్నా వంటికి కొంచెం కూడా అంటదు అన్నట్లు రాజు నావల్ల ఏమీ మార్పును పొందలేకపోయాడు.

(44వ పేజీ చూడండి)

గడచిన పది రోజులలోనూ రాజు తన మామయ్య దగ్గరనుంచీ మరో రెండు మామూలు ఉత్తరాలు పుచ్చుకున్నాడు ఏప్రిల్ నెలను వదిలి మే నెలలో ప్రవేశించి మే నెలను కూడా సగం వెనక్కు నెట్టాము.

అవేళ టపాలో రాజుకు లాయర్ నోటీసు వచ్చింది. నాకు చూపించాడు ఇద్దరం మా వీధి అరుగుమీద కూర్చున్నాము

"నాకు ఉద్యోగం కావాలి నేను సంపాదించాలి. ఋణం తీర్చాలి లేకపోతే చచ్చిపోవాలి" రాజు తనలో తను గొణుక్కుంటున్నాడు

"నా మాట విని డబ్బు ప్రస్తుతం తీర్చలేను ఉద్యోగంలో చేరిన తర్వాత దఫదఫాలుగా తీర్చగలను అని రాసెయ్యి" అన్నాను

రాజు నా మాటలకు ఏమీ సమాధానం యివ్వలేదు.

* * *

ఆ సాయంత్రం మామూలుగా నూతి గట్టున కూర్చున్నాము

"రాజూ పోనీ మీ యింకోమ్మగారిని అడగ కూడదూ'

"ఏమిటి?"

"డబ్బురా—ఏం? ఆవిడకు బోలెడు ఆస్తి వుంది కదా ఆ మాత్రం యివ్వలేదూ—ఉద్యోగం వచ్చిన తర్వాత తీరుద్దువుగాని"

"ఇస్తుందని నేననుకోను"

"ఎందుకు యివ్వదు? చచ్చినట్టు యిస్తుంది. అసలు తప్పంతా ఆవిడదేకదా మీ అమ్మగారు పోయి నప్పుడు నిన్ను ఆవిడ మీ నాన్నగారివద్దనుండి వేరు చేసి యిక్కడకు తెచ్చి పెంచింది ఇక్కడే నువ్వు యస్. యస్ యల్ సి. ప్యాసయ్యావు నువ్వు ఫోర్తుఫారం చదువుతున్నప్పుడు అనుకుంటా మీ నాన్నగారు మళ్ళి పెళ్ళి చేసుకున్నది. అనాడు కూడా నిన్ను వెళ్ళనివ్వలేదు ఇంటరు చదువుకోసం నువ్వు వెళ్ళేలోగా అసలు ఆగడపే తొక్కలేదు అందుకనే మీ నాన్నగారు నిన్ను అనుమానించడానికి అవకాశం ఏర్పడింది ఆయన కళ్లెదురుగానే నువ్వు ఎదిగితే యిలాంటి అవస్థ అనుమానాలకి తావు వచ్చేదికాదు. యీ తప్పు లన్నిటికీ మీ యింకోమ్మే బాధ్యురాలు. కనుక ఆవిడ నష్ట పరిహారం క్రిందైనా యిచ్చి తీరాలి' అన్నాను పిచ్చి ఆవేశంతో

'సరే నీ మాట కాదనడం ఎందుకు? నీ ఎదురు గానే అడుగుతానురా" అంటూ లేచాడు. నేనూ లేచాను. తిన్నగా రాజు యింటికి వచ్చాము నేను కుర్చీమీద కూర్చున్నాను రాజు నాకేసి రెండుసార్లు చూసి డబ్బు విషయం ప్రస్తావించాడు సొంతం విన్న ఆమె ముఖం సాంబ్రాణిలా నల్లబడిపోయింది

"బి ఏ చదివావుకదా ఉద్యోగం చెయ్యలేవురా? యింకా నేనే సహాయం చెయ్యాలా—చిన్నప్పటి నుంచీ పెంచాను, పెద్ద చేశాను చాలా డబ్బు ఖర్చు పెట్టాను యిక నావల్లకాదురా నాయనా—నీకు కోపంవచ్చినా సరే!" అంటూ కోపంగా నాకేసి చూసింది. రాజుకు సంజ్ఞ చేసి నేను యింటికి బయల్దేరాను. యాంత్రికంగా భోజనంచేసి ఆరుబైట మంచం వేసుకు పడుకున్నాను నా ఆలోచనలలో రాజు మెదిలాడు. నాకు ఏంచెయ్యాలో తోచలేదు.

నాన్నగారు పొలంనుంచివచ్చి స్నానంచేసి

# ఇచ్ఛ - దైవేచ్ఛ

(19వ పేజీ తరువాయి)

భోజనంచేసి పక్కమీద కూర్చున్నారు. నాన్నగారి సహాయం అడుగుదాం అనుకుని నేను లోపలకెళ్ళి ముక్కాలిపీట తెచ్చుకుని ఆయన మంచం ఎదురుగా వేసుకుని నెమ్మదిగా కూర్చున్నాను నా మనస్సు పరిపరి విధాల ఆలోచిస్తోంది. నాన్నగారిని అడగడానికి నోరు పెగలటంలేదు జవాబు ఏమని చెప్పాలో—

ఆయనతో మాట్లాడడమే చాలా కష్టం. నాన్నగారు చాలా తక్కువగా మాట్లాడుతారు.

"ఏం? పనుందా' అన్నారు గంభీరంగా

కాస్సేపు తటపటాయించి నేనసలు సంగతి చెప్పాను

"అంటే నీ వుద్దేశ్యం?"

ఉపాధ్యాయుడు: ఈ క్లాసులో మొద్దులెవరైనా వుంటే లేవండి. (బల్లముందు నిల్చొని ప్రశ్నించాడు)

కొద్దిసేపయ్యాక ఒకవిద్యార్థి లేచి నిలబడ్డాడు

ఉపా: నీవు మొద్దువని నీకే తెలుసా?

విద్యార్థి:—అది కాదండి. మీరొక్కరే నిలబడివుంటే నాకు సిగ్గేసి మీకు తోడుగా నేను నిలబడ్డానండి.

డి. ఋష్యేంద్రమణి (మద్రాసు)

"మనం కొంచెం ఆదుకుంటే అతనికి కొంచెం శాంతి కలుగుతుంది చాలా బాధపడుతున్నాడు" నీళ్ళు నములుతూ అన్నాను

"ఆహా! ఎంత ఏమిటి?

"వెయ్యి రూపాయలు"

ఆ మాటతో ఆయనోట్లో చుట్ట చప్పున జారి నేలమీద పడిపోయింది

"వెయ్యి రూపాయలు సర్దగల స్తోమత మనకు ఉందని నువ్వు అనుకుంటే—యివిగో తాళాలు యిన పెట్టె తెరిచిచూడు నీకే తెలుస్తుంది—నావూహా ఎంతవరకూ నిజమో" అంటూ తాళం చెవులు నా ఒళ్ళోకి పడేసి మంచంమీద వెల్లకిల్లా పడుకున్నారు

"మనం సహాయం చెయ్యగలమనికాదు—చెయ్యగలం ఏమో అని అడిగాను' అంటూ తాళాలు మంచంమీద పెట్టాను

"అదికాదు—ఒక రెండు మూడు వందలయితే నిరభ్యంతరంగా సర్దగలము" అన్నారాయన.

"అలా చెప్పమంటారా" అన్నాను నేను.

"ఆ విషయం ఆలోచించవలసినది నువ్వు. ఆ డబ్బు నువ్వు ఎప్పుడడిగినా యివ్వడానికి నేను సిద్ధం అన్నారు

"అలాగేనండి!" నా పక్కమీదకు వచ్చేశాను.

* * *

మర్నాడు సాయంత్రం షికారులో రాజుతో యీ సంగతి చెప్పాను దానికి రాజు తల అడ్డంగా వూపుతూ "లాభంలేదు! డబ్బు అంతా ఒక్కసారి గానే యిస్తానని రాశాను" అన్నాడు నాకు నవ్వాలో ఏడవాలో తెలియలేదు.

"ఛీ—అదేం పనిరా? నువ్వు చేసిన పని శుద్ధ తెలివి తక్కువవాడు కూడా చెయ్యడు!" అన్నాను నేను 'అవును' అని తల వూపాడు.

"మీ మామయ్యని తన యిష్టం వచ్చినట్లు చేసు కోమని వ్రాయి—కోర్టువారు కూడా సంపాదనలేని నిన్ను ఏమీ చెయ్యలేరు దఫ దఫాలుగానే తీర్చవచ్చు నంటారు" అన్నాను.

"కానీ జాలి పడి నా బాగుకోసం ధన సహాయం చేసిన మామయ్యను కోర్టుకులాగడం నాకిష్టంలేదు"

"ఛీ—యివ్వద్రా నువ్వు? వాడే నిన్ను కోర్టు కెక్కిస్తే—నువ్వు వాణ్ణి ఎక్కించేదేమిటి?"

రాజు నా మాటలు వినకుండా ఎటో చూస్తు న్నాడు "రాజా! యిలాగే గనుక నువ్వు సంచరిస్తే నీకు వారం రోజుల్లో పిచ్చిఎక్కిపోతుంది" అన్నాను. "నిజంగానా" అన్నాడు నాకేసి చూస్తూ.

"ఆ! నిక్కచ్చిగా" అన్నాను రాజు చిన్నగా నవ్వుతూ "అప్పుడయితే నా అంత అదృష్టవంతుడు ప్రపంచంలో ఎవ్వడూ ఉండడు" అన్నాడు.

* * *

అవేళ మే మిద్దరం షికారుకువెళ్ళి అప్పుడే యింటికి వచ్చాను అనుకోకుండా ఆవేళ రిజల్ట్సు వచ్చాయి రాత్రికి రాత్రి బెజవాడనుంచి పేపరు తెప్పించారు

"రిజల్ట్సు వచ్చాయి" అని మా తాతయ్య అనగానే రాజు కుప్పలాగ అరుగుమీద కూర్చున్నాడు. మీ నెంబర్లు ఎంతోయ్! అని అడుగుతున్న తాతయ్య చేతిలోంచి పేపరు తీసుకు చూశాను.

నేను మూడు పార్టులూ మామూలుగానే ప్యాస య్యాను. రాజు పార్టు టూ, పార్టు త్రీ ఫస్టు క్లాసులో ప్యాసయ్యాడు.

"రాజా! వెరీగుడ్" అని అరిచాను "ఏమిటి ఫస్టుక్లాసా? నాకా??" అన్నాడు. అరుగుమీంచి లేస్తూ నా చేతిలో పేపరు తీసుకుని చూసి "అవును రైట్!" అన్నాడు నవ్వుతూ మళ్ళా పేపరు చూశాడు యీసారి కొంచెం గట్టిగా నవ్వాడు. మళ్ళా పేపరు చూశాడు యింకా గట్టిగా నవ్వుతూ పేపరుచింపి నా ముఖంమీద పారేశాడు 'రాజా' అని అరుస్తూ, అతన్ని గట్టిగా పట్టుకున్నాను. నన్ను విదిలించుకోబోయి రాజు క్రిందపడిపోయాడు. పావుగంట సేపయినా స్పృహలేదు. నేనూ, తాత య్యా రాజు తల దగ్గర కూర్చున్నాం. 'ఏం జరి గింది' అంటూ అప్పుడే పొలంనుంచి వస్తున్న నాన్నగారు రాజు పక్కన కూర్చున్నారు. అమ్మా, పిల్లలూ వించుని చూస్తున్నారు

## మనసు

క్రమము తప్పినచో

## అదే పిచ్చి

* వస్త్రధారణలోను, అలవాట్లలోను క్రొత్తదనము
* వెఱ్ఱిచూపులు
* విచారము, పరధ్యానము
* మతిమరపు
* అస్పష్ట తీర్మానములు
* స్వాధీనము తప్పిపోవుట
* భ్రమ, భయము, విభ్రాంతి

## మతిభ్రమకు

యివన్నీ చిహ్నములు

ప్రారంభములోనే

దీన్ని హతమార్చండి

స్వయంగా లేక ఉత్తరాలద్వారా

కవిరాజ్ పండిట్ దుర్గాదత్తశర్మ వైద్యవాచస్పతి గారిని సంప్రదించండి.



**Navratna Kalpa Pharmacy**
**Jullundur City (India)**


# ఇచ్ఛ - దైవేచ్ఛ

టింకా ఆలస్యం?" అన్నాడు అరుగుమీద కూర్చున్న తాతయ్య రాజులో మార్పు వచ్చిందని అనుకుని "ఏంనాయనా! ఎలా వుంది నీ వంట్లో" అన్నాడు

"నాతో మాట్లాడకోయ్! ఈ ముసలాళ్ళంటే నాకు అసహ్యం! లోకంలో వీళ్ళవల్లే యువకులు అవస్థ పడుతున్నారు ఉద్యోగాలు కూడా దొరకటంలేదు" అని వీధిగుమ్మంవైపు నడిచాడు నేను కూడా రాజు వెనకాల పరిగెత్తాను. తాతయ్య కొయ్యబారిపోయాడు.

బావిగట్టుకు చేరేదాకా మళ్ళా ఏమాటా మాట్లాడలేదు నేను గట్టుమీద కూర్చున్నాను. రాజు గోడ ఎక్కి కూర్చుని "మిస్టర్ వ్యాస్—నీ పేరు ఏమిటి?" అన్నాడు

"వ్యాసభూపతి" అన్నాను భయపడుతూ,

"అలాకాదు. ఏ పేరు పెట్టిపిలవను?"

"వాసు అని పిలు"

"ఆ! వాసూ నేను చావదలుచుకోలేదు నా నిశ్చయం మార్చుకున్నాను మామూలుగా ప్యాసైన వాడివి నువ్వే బతికి యిస్త్రీ బట్టలుకట్టి బాగు పడాలని చూస్తుంటే డబుల్ ఫస్టు క్లాసు వచ్చిన నేను ఎందుకు చావాలి చావను నాకు తప్పక ఉద్యోగం వస్తుంది. నీకన్నాముందరే వస్తుంది. ముందుగా నాకు యిచ్చి తర్వాత నీకు యిస్తారు. అదైనా కాళీలుంటేనే" అన్నాడు

"అవును నీకు తప్పక ఉద్యోగం వస్తుంది" అన్నాను

"ఎదురు సమాధానం చెప్పక, బుద్ధిమంతుడిలా విను. లేకపోతే అసలు నీకు ఉద్యోగం రాకుండా చేస్తాను' అన్నాడు.

నేను లేచి నించున్నాను. రాజు గోడ దిగాడు. "వాసూ! నిన్ను అనరాని మాటలు అంటే క్షమించు. వాటిని మర్చిపో. నాకీ మధ్య బుర్ర సరిగ్గా లేదు. కారణం ఏమిటో నాకే తెలియదు" అన్నాడు. ఆ మాటలతో నా హృదయం పగిలిపోయినట్లయింది. "సర్వేశ్వరా ప్రపంచంలో మంచివాళ్ళకూ అమాయకులకూ నువ్వు ఏమీ చెయ్యలేవా? వాళ్ళ నేనా నువ్వు నాశనం చేసేది" అనుకున్నాను.

మౌనంగా యిద్దరం నడక ప్రారంభించాము. "నేను చావదలుచుకోలేదు. చావే వచ్చి అడిగినా వీల్లేదు. ఇప్పుడు శలవ దొరకదు. ఫో అంటాను" అన్నాడు. "అవును నువు చావద్దు. నీకు తప్పక ఉద్యోగం వస్తుంది" అన్నాను.

* * *

మర్నాడు ఉదయం నాన్నగారు నన్ను ఏదో పొలం పనులమీద పొరుగూరు వెళ్ళమన్నారు. వెళ్ళక తప్పిందికాదు. "రాజు మనింటికి వస్తే వంటరిగా షికారుకు నేను వెళ్ళద్దని చెప్పానని చెప్పండి. వీలైతే సాయంత్రంలోపు వచ్చేస్తాను' అని మా నాన్నగారితో చెప్పి బయలుదేరాను.

అనుకున్నట్టుగా పని అవలేదు. ఆనాడంతా ఆ వూళ్ళోనే ఉండవలసి వచ్చింది. ఆ రాత్రంతా నాకు నిద్దర పట్టలేదు. కళ్ళుమూసినా, తెరిచినా రాజే ప్రత్యక్షమయ్యాడు. తెల్లవారింది పని యింకా తెమల్లేదు. పదిన్నరకు నా పని అయ్యింది. ఆ వూళ్ళోనే భోజనంచేసి కారెక్కాను.

మావూరు చేరుకునేసరికి టైము రెండు అయ్యింది. మిట్ట మధ్యాహ్నం వేసవికాలం గాడ్పు విపరీతంగా వస్తోంది వీధిలో ఒక్క పురుగు కూడా లేదు రిక్షా దిగి ఇంట్లో ప్రవేశించాను.

అమ్మ మజ్జిగ తెచ్చి యిచ్చింది. మజ్జిగతాగి గ్లాసు క్రిందపెడుతూ "అమ్మా అలా వున్నావేం" అన్నాను. "ఏంలేదురా" అనేసి లోపలకు వెళ్ళిపోయింది

గదిలోకి వెళ్ళి మంచంమీద పడుకున్నాను. "మా మామయ్యను బతిమాలి నా ఉద్యోగం రాజుకు వేయించేస్తే రాజు పిచ్చి నయమవుతుందనుకున్నాను. ఈలోగా అమ్మ గదిలోకివచ్చి నా ఎదురుగాఉన్న కుర్చీలో కూర్చుంది. ఆమె ముఖంలో అనిర్వచనీయమైన బాధ వుంది.

"అక్కకులాసాగా ప్రసవించిందా?" అని అడిగాను అనుమానంగా.

"ఆ! మగపిల్లాడుట. సుబ్బాడు చెప్పాడు" అంది.

"మరింకా ఏమిటి" ఆశ్చర్యంతో అడిగాను.

"మన రాజు లేడూ...."

"ఆ .ఏంమయ్యింది" అన్నాను పక్కమీంచిలేచి కూర్చుని.

"....నిన్న ఎంత వద్దన్నా వినకుండా షికారు వెళ్ళాడు. పాము కరిచి పోయాడుట. శవాన్ని ఫదింటికి వెతికి పట్టుకొచ్చారు."

నా బుర్ర బొంగరంలా తిరిగిపోయింది. కూర్చున్న మంచం పాతాళంలోకి జారపడిపోయినట్టయ్యింది 'ఆ! చచ్చిపోయాడా' అన్నాను మంచం మీంచిలేచి నించుంటూ.

'నేను చావను. చచ్చినా చావను చావు వచ్చి అడిగినా సరే యిప్పుడు సెలవులేదని చెప్తాను' అన్న రాజు మాటలు నా చెవిలో రింగుమన్నాయి. ఏడుద్దామన్నా కళ్ళవెంట నీరు కారలేదు

"శవ దహనం అయిపోయి ఇందాకనే వాళ్ళు వచ్చారు" అంది అమ్మ నెమ్మదిగా.

"చస్తాను చస్తాను అన్ననాడు వాడిని దేముడు కూడా చావనివ్వలేదు. చావను అన్నాడో లేదో చచ్చిపోయాడు"

"ఏదీ మన చేతిలో లేదురా నాయనా—దైవేచ్ఛకూ, మానవేచ్ఛకూ ఎప్పుడూ పొత్తు కుదరదు" అంది అమ్మ.

మంచంమీంచిలేచి చకచకా బట్టలు సర్దుకోడం ప్రారంభించాను. "ఎక్కడికి వెళ్తావురా హడావుడిగా బట్ట సర్దుతున్నావు' అన్నాడు. తాతయ్య లోపలకు వస్తూ.

"నన్ను ఎవ్వరూ మాట్లాడించకండి. ఈ దిక్కుమాలిన వూళ్ళో ఒక్క క్షణం కూడా ఉండను. మామయ్య దగ్గరకు పోతున్నాను నేను ఆ ఉద్యోగమే చేస్తా" అని అరిచాను.

స్నేహితుణ్ణి పోగొట్టుకున్న ఆ వూరిలో కన్నతల్లి దండ్రులకోసమైనా ఉండబుద్ధి కాలేదు.

నా బాధ గ్రహించిన నాన్నగారు జేబులోంచి వంద రూపాయల కాగితంతీసి "నీయిష్టప్రకారమే చెయ్యి" అన్నారు.

పెట్టె బెడ్డింగూ పాలేరువాడి నెత్తినపెట్టి అంత ఎండలోనూ బస్సుస్టాండుకేసి పరిగెత్తాను. ★